# పరంధాముడి అభ్యుదయం

ద్రోణంరాజు కృష్ణమోహన్

ఉన్నట్టుండి హఠాత్తుగా మా పరంధాముడు యింత అభ్యుదయవాదిగా మారిపోవడం మా కందరికీ అమితాశ్చర్యం కలిగించింది. పూర్వం లంచాలు తీసుకోవాలనేవాడు. తప్పులేదన్నాడు. తీసుకున్నాడు స్వయంగా. తోటి గుమాస్తాలకు వాటాలు పంచేవాడు. ఎవరొచ్చినా నిర్మొహమాటంగా అడిగేవాడు. వాళ్లు డాబుసరిగా వుంటే పరంధాముడు మరింత బెట్టుసరిగా ఉండేవాడు.

"ఏమో! ఎవడికి తెలుసు మీ అప్లికేషన్ సంగతి! దాని రోజొచ్చినపుడు చెప్పుతాంలెండి" అని మహాధాటీగా కసిరేవాడు. పాపం లంచం యివ్వ లేని వాళ్లు, యివ్వగలిగి యివ్వ నిరాకరించే వాళ్లు మొహాలు వేళ్లాడేసుకుని జారుకునేవారు. ముఖ్యంగా యివ్వగలిగి కూడా యివ్వని వాళ్ళని ఉద్దేశ పూర్వకంగా భలే తిప్పలు పెట్టేవాడు.



చాలాసార్లు నేను వాడిని మందలించాను. కాని వినలేదు. "ఇది అన్యాయంరా! చదువుకున్నావ్ కూడా! ఇదేం దుర్బుద్ధిరా! నీ కాలేజి విజ్ఞానం, నీ ఆశయాలు, నీ ఉపన్యాసాలు, అన్నీ ఏమయినట్టురా?' అని నిగ్గదీసి అడిగితే అమాంతం రెండు కప్పుల కాఫీపోయించి నోటి నిండా నాలుగు సిగరెట్లు కుక్కి యింటికి పోయే వాడు. ఆఫీసులో యించుమించు వాడి మాటను ధిక్కరించ గలిగేవాడు లేడంటే అతిశయోక్తి కాదు.

"గుమాస్తా ముండాకొడుకులం! ఏదో ఒక రూపాయి డబ్బులు కాస్త తినకపోతే ఎలా బతక మంటావ్ బ్రదర్?" అని విసుక్కునేవాడు. అవునా! అదీ నిజమే మరి పాపం! బస్తీ కాపురం. పెళ్ళాం, యిద్దరు పిల్లలు, పెళ్ళి కావలసిన చెల్లెలు. వాడు మటుకు అవకాశాలు జారవిడుచుకుని వస్తులుంటాడా?

ఇది యిలా వుండగా, అమాంతంగా వాడి బావ మరది చనిపోవడం, ఆస్తి సుమారు 40 వేలు మనుమల పేర వ్రాసి మామగారు కూడా త్వరలోనే దాటుకోవడం జరిగింది. ఆస్తి అన్న తరువాత చూడండి లక్ష పనులుంటాయి. రిజిస్ట్రారు ఆఫీసు గానివ్వండి, కోర్టులనుంచి వారసత్వపు సర్టిఫికెట్లు రాబట్టటమే గానివ్వండి మున్సిపాలిటీలో పట్టా మార్పిడికి దరఖాస్తే గానివ్వండి, మరేపనయినా గానివ్వండి. వాడు జీవితంలో ఎప్పుడూ, అంటే యీ ఎనిమిదేళ్ళ వుద్యోగంలోను, ఒకరిదగ్గర పుచ్చుకోవడమేగాని ఒకరికి యిచ్చి ఎరగడు. కారణం ఒకే వూళ్ళో యీ ఎనిమిదేళ్లు వుద్యోగం చేయడం, నాలుగు ఆఫీసులు బాగా పరిచయమై వుండటం. పైగా దమ్మిడీ ఆస్తిలేనివాడికి ఆఖరికి మున్సిపల్ ఆఫీసులో మాత్రం ఏం పనుంటుంది!

కాని అత్తగారి వూరొచ్చాక—అంటే నేను వుద్యోగంచేసే వూరు—నూతనాధ్యాయం ప్రారంభమైంది. వద్దురా అని మొత్తుకున్నా వినక వుద్యోగానికి రాజీనామా యిచ్చాడు.

"మన కేంరా? నెలనెలా వందరూపాయలు అద్దెవచ్చే డాబా యిల్లు, ఎనిమిదెకరాల సుక్షేత్రమైన మాగాణి, పాతర సామగ్రి సమస్తం కాళ్ళ దగ్గరకు నడిచివచ్చాయి." అంటూ వుద్యోగానికి గుడ్‌బై కొట్టాడు. లక్షణంగా ఆస్తిని కట్టుదిట్టం చేసే ప్రయత్నానికి దిగాడు. ఇక అన్నీ పనులే. గుమాస్తాలు, జవాన్లు, అటెండర్లు, వగైరా మామూలు వాళ్ళంతా వీడిచుట్టూ తిరగడం ప్రారంభించారు.

"వెధవలు. మరీ యింత లంచగొండితనమా! ఇంత అవినీతిరా గవర్నమెంటు డిపార్టుమెంట్సులో! ఒక్కొక్కడిని పాతేసి చర్మం వొలవాలిరా!" ఒకరోజున, అనగా వుద్యోగం మానేసిన ఏడాదికి, పార్కులో సిగరెట్ ముట్టిస్తూ అన్నాడు.

"ఏం? నువ్వు తీసుకున్నప్పుడో?" గట్టిగా అడిగాను.

"ఊఁ... అంతేలే... అయినా... ఎబ్బే యింత ఘోరమా... ఛ ... ఛ ... మరీ అధ్వాన్నమవు

తోంది పరిస్థితి. నేనంటే ఏదో బహుకొద్దిగా—అదయినా యిష్టపూర్వకంగా యిస్తేనే-పుచ్చుకొనేవాడిని." పాపం! ఏదో సమర్థించుకోబోయాడు. వాడిని యిక యిరుకులో పెట్టదలుచుకోలేదు. ఆ నాటికి యిక లేచాం.

* * *

"ఒరేయి కామేశం" పిలుపు వినబడి ప్రక్కకి చూశాను గుమ్మం వైపు. మావాడు ప్రత్యక్షం! వస్తాడని ఎలాగూ తెలుసు.

"రా...లోపలికి" పిలిచాను. వచ్చి కూర్చున్నాడు.

"కొంచెం అర్జంటు పనిరా!"

"ఏం కథ?"

"మా మామ గారి వీలునామా నకలు కావాలిరా."

"మునిసిపాల్టీ డెత్ సర్టిఫికెట్ ఏదీ?"

"ఎక్కడనుంచి తెమ్మంటావ్?"

"వెళ్ళి తారీఖు అవీ చూసుకుని మున్సిపాల్టీలో కాస్త ఎవరినన్నా మంచి చేసుకో" సలహా విని వెళ్ళాడు. రెండురోజులు గడిచాయి.

"ఇదిగో సాధించాను" చూపించాడు.

"ఏ మాత్రం వొదిలింది?"

"ఆ...మామూళ్ళే అయిదురూపాయలదాకా వదిలాయి" విసుగ్గా చిరాకుగా అన్నాడు. నవ్వొచ్చింది.

"ఊఁ..." అని ఊరుకున్నాను.

"మరి నకలు యిప్పించు అర్జంటుగా సాయంత్రానికి."

"సాయంత్రానికీ!"

"అవును. పోనీ రేపటికయినా కావాలి. చాలా అవసరం."

"సరే...ఆయన్ని అడుగు" వెళ్ళాడు ఎదురుగావున్న గుమాస్తా వద్దకు. తిరిగి వచ్చాడు.

"నకలుఫారం లేదంటాడేమిటిరా ఆ గుమాస్తా?"

"అయితే నన్నేం చెయ్యమంటావ్?" అదో మాదిరిగా అన్నాను. వాడిముఖం మారిపోయింది. నిరాశ, నిస్పృహలు కనిపించాయి. జాలేసింది.

"కొంచెం చూడరా" బ్రతిమిలాడాడు.

"వాడిచ్చే రకం కాదురా అంతచప్పున" లేచి నిలబడ్డాను.

"నీమీద కొండంత ఆశ పెట్టుకువచ్చానురా బ్రదర్."

"సరే...చూద్దాం" అంటూ వెళ్ళి మరో గుమాస్తా దగ్గిర నుంచుని ఆ కబురూ, యీ కబురూ చెప్పి మెల్లగా ఒక ఫారం లాక్కొచ్చాను. వాడు దస్తావేజులు వ్రాసేవాడిచేత వ్రాయించి సంతకం చేసి దాఖలు చేశాడు.

"మరి మామూలు సంగతి?" నిర్మొహమాటంగా అడిగాడు ఆ గుమాస్తా వాడిని.

"ఇవ్వాలంటారా?"

"అఁదేమిటండోయ్! ఇవ్వాలంటారా అంటారేఁమిటి! ఇవ్వక పోతే రేపు యీపాటికి మీది ఎలా వస్తుంది?" హారినీ! ఆశ్చర్యమేసింది మావాడికి! తన అనుభవాలు గుర్తుకొస్తున్నాయి.

"జేబులో బొత్తిగా లేవురా" ఖాళీజేబులు చూపాడు నా దగ్గిరకొచ్చి. నేను వెళ్ళి గుమాస్తాతో సర్దిచెప్పాను. మరునాడు సాయంత్రం వాడిపని పూర్తయింది.

"నువ్వున్నావు గాబట్టి త్వరగా అయింది. లేకపోతే వెధవ మామూళ్ళు, వీళ్ళూనూ" అంటూ ఒక సిగరెట్ పారేశాడు. నేను సమాధానం చెప్పలేదు.

"ఏఁమిట్రా...దిగాలపడి కూర్చున్నావ్?"

"అఁ. ఏఁవీలేదు. ఒక్క ఐదు రూపాయలు సర్దరా. రేపు మనియార్డరు వస్తుంది బహుశా" అన్నాను.

"ఓశ్...యింతేగదా! ఇదివరకెన్నిసార్లు ఇవ్వలేదు, ఎన్నిసార్లు తీర్చలేదూ...తీసుకో" అంటూ చేతిలో పెట్టాడు.

మరునాడు నా దగ్గిరకు వచ్చాడు; వాడి వుద్దేశం మనియార్డరు వచ్చివుంటుందనే.

"దణ్ణం బాబూ..." వఁగి వంగి మరీ నమస్కారం చేశారు జవాను లిద్దరూ వాడికి వాడు తెల్లబోయి, తెప్పిరిల్లాడు వెంటనే. లోపల అడుగు పెట్టగానే—

"రండి... రండి" ఆహ్వానించాడు కుర్చీ చూపిస్తూ మొన్న కసురుకున్న గుమాస్తా. మరీ ఆశ్చర్యమేసింది.

"అందరికంటె నువ్వు ఎక్కువిచ్చావ్ కదురా, అందుకని" అన్నాను. మా వాడికి మూర్ఛ వచ్చినంత పని అయింది. ★